# “నాకీ పుస్తకం ఎందుకు నచ్చిందంటే -”

**మొదలి నాగభూషణ శర్మ**

తెలుగువాళ్లకి తమని గురించి తాము పొగుడుకోవడం అనే యిష్టంతో పాటు అవతలివాడిని చులకన చేయడం అనే యిష్టం కూడా అలవాటుగా వస్తున్నది. అందుకే మనకు వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించే జీవిత చరిత్రలు లేవు. బతికున్న వాళ్ల మీద అసలు లేవు. ఒక జీవించి వున్న గొప్పవాడిని ‘‘ఈయన గొప్పవాడు’’ అని చెబితే మనల్ని తక్కువ చేసుకుంటున్నామేమోనన్న న్యూనతా భావంతో పుట్టిపెరిగిన వాళ్లం మనం. ఇందుకు ప్రతిగా, ఒక సమకాలికుడైన భరతాచార్యుడి జీవితానికి అక్షరయోగం కల్పిస్తూ చేసిన ఈ అరుదైన జీవిత చరిత్రను హార్దికంగా స్వాగతిస్తున్నాను. బహుశః తెలుగులో నృత్య కళాకారులను గురించి వచ్చిన మొట్టమొదటి జీవిత చరిత్ర కూడా ఇదేననుకుంటాను. ప్రదర్శక కళారూపాల మీద, రూపకర్తల మీద పుస్తకాలు అవసరమన్న ఒక నగ్న సత్యాన్ని ఈ పుస్తక రచన ద్వారా పరిశోధకులకు తెలియచెప్పిన ఆచార్య రామకృష్ణ, డాక్టర్ లలిత గార్లను మనసారా అభినందిస్తున్నాను. మరొకందుకు కూడా ఈ రచయితలని అభినందించాలి. అందరూ ఆనందిస్తూ ఎవ్వరూ సీరియస్‌గా తీసుకోని (లేదా, అతికొద్దిమంది మాత్రమే సీరియస్‌గా తీసుకొనే) ఒక కళాప్రక్రియలో నిష్ణాతుడైన ఒక మహామహుడి జీవిత చరిత్రని తరవాత తరాల వాళ్లకి చెప్పాలి – అన్న వీళ్ల ‘తపన’కి.

ఒక వ్యక్తిని బేరీజు వేసేటప్పుడు రెండు పార్శ్వాల నుంచి ఆ జీవితాన్ని విశ్లేషించాలి. ఒకటి : “ఆయన జీవితంలో సాధించిందేమిటి” అన్నది. రెండోది : ఆయన జీవిత విధానానికి, ఆయన చేపట్టి అజరామరం చేసిన కళాప్రక్రియకి ఉన్న అవినాభావ సంబంధం యేమిటి? “ఈ రెండో ప్రశ్ననే మరోవిధంగా వేసుకోవచ్చు.” ఆయన జీవితం సమకాలీన కళా జీవితాన్ని ఏవిధంగా ప్రభావితం చేసింది – అని. ఆ రెంటికీ సమాధానం ఈ జీవిత చరిత్ర.

నటరాజ రామకృష్ణ ఒక వ్యక్తి కాదు. ఒక శక్తి. ఒక ఉద్యమం. ఒక నిశ్శబ్ద విప్లవం. జ్వలిస్తున్న అగ్నిగోళం. విషాదమైన చిరునవ్వు వెనకాల గుండెలు పిండేసేటంతటి ఆత్మఘోష. సమకాలీన నిరపేక్షకి ఒక ఆర్ద్రమైన హృదయం చేసే ఆక్రందన ఆయన జీవితం.

రామకృష్ణ తన జీవితకాలంలో అనితరసాధ్యమైన అనేక విజయాలు సాధింన కళాసరస్వతి. పరమ నిషిద్ధమైన రోజుల్లో యిల్లు వదిలి వెళ్లి దేవదాసీ నృత్యం నేర్చుకున్నాడు. మద్రాసు రామకృష్ణ మిషన్ లైబ్రరిలో శాస్త్ర గ్రంథాలు అవుపోసన పట్టాడు. నాగపూర్‌లో కథక్ నృత్యం మెళకువల్ని నేర్చుకున్నాడు. తాను గురువుగా ఉంటూనే ఉత్తమ గురువర్యుల పాదాల చెంత కూచిపూడి నేర్చుకున్నాడు. నేర్చుకున్న ప్రతి నృత్య ప్రక్రియకూ లక్షణాలను కూలంకషంగా గ్రహించాడు. గ్రహించిన దానిని విశ్లేషించాడు. తులనాత్మకంగా చూసి అన్నిటి సామాన్య లక్షణాలను సమన్వయం చేసుకున్నాడు. ఈ సమన్వయంలో నుంచి వచ్చినవే అసంఖ్యాక వ్యష్టి, సమిష్టి నృత్యాంశాల "నృత్య సంరచన." వాటి పర్యవసానం ఆయన "మేఘసందేశం, కుమారసంభవం" వంటి అత్యుత్తమ నృత్య సంరచనా రూపకాలు. వాటికి ఆయన సాధించిన గుర్తింపులూ, అవార్డులూ.

నాకు తెలిసినంతవరకు రామకృష్ణ తాను సాధించిన విషయాలను గురించి ఏనాడూ చాటుకోలేదు. (అలా జరిగివుంటే ఆయనకు ఎప్పుడో పెద్ద పెద్ద బిరుదులూ, పదవులూ వచ్చి వుండేవి). ఆయన తపనంతా చేయవలసిన విషయాలను గురించే! భారతదేశంలో నాలుగే శాస్త్రీయ నృత్యరీతులను గుర్తించిన తరుణంలో కూచిపూడి సంగతేమిటి? – అని నిలదీసిన వ్యక్తి ఆయన. అందుకోసం ఆనాటి సంగీత నాటక అకాడమీ ఒక మహాసభను నిర్వహిస్తే ఆయన దానికి కన్వీనర్. కూచిపూడికి శాస్త్రీయ యోగ్యత కల్పించడంలో నటరాజ రామకృష్ణ పాత్ర ఆంధ్ర నృత్య కళా చరిత్ర తెలిసిన వారందరికీ సుపరిచితం.

ఆ సభల్లోనే ప్రఖ్యాత అభినయ కళాకారిణులైన మారంపల్లి వైదేహి, ఇందువదన అనే దేవాలయ నర్తకీమణుల ప్రదర్శనను రామకృష్ణ ఏర్పాటుచేస్తే వారు ఆ సభలో రెండు గంటలపాటు ఒకే ఒక శ్లోకానికి అభినయం చేసి, "తెలుగువారి అభినయం అంటే ఇదీ" – అని చూపించినప్పుడు మన లాస్యనర్తన వైభవం కూడా దేశానికి మొదటిసారి తెలిసి వచ్చింది.

ఆ దేవాలయ నర్తన విధానాలని ఆకళింపు చేసుకొని ఆలయ నృత్యాల విస్తృతినీ, ఆ నృత్యాలలో వున్న సొబగునూ, మాధుర్యాన్ని, ఉన్నత ప్రమాణాల్నీ దేశానికి తెలియచెప్పాలని ఎక్కడెక్కడ యీ నృత్య విధానం పూర్వకాలంలో రాజ్యం ఏలిందో ఆ ప్రదేశాలన్నింటిని తిరిగాడు.

మాట్లాడటానికి సంశయించిన వారందరితో మాట్లాడాడు. వారిని అనునయించాడు. సంఘ భయంతో వెలికిరాని ఆణిముత్యాలవంటి నర్తకీమణుల అనూహ్య నృత్య విన్నాణాలను ప్రపంచానికి చాటేడు – అభినయ సదస్సు ద్వారా. ఆ అభినయ విధానంలో 'కొలికిపూస' అనదగిన నవజనార్దన పారిజాతానికి తిరిగి జీవం పోశాడు. లాస్య నర్తనం లానే తనను అలరించిన అలనాటి తాండవ నృత్య శైలీ విధానమైన పేరిణికి పునరాకృతి కల్పించాడు. తెలుగువారి జానపద నృత్య రీతుల వైభవాల్ని ప్రజలకు, ప్రభుత్వానికి విప్పి చెప్పాడు.

ఒక్కమాటలో చెప్పాలంటే తెలుగువారి నృత్య కళా విన్నాణాన్ని దేశానికి ఎలుగెత్తి చాటిన వైతాళికుడు డాక్టర్ నటరాజ రామకృష్ణ.

తెలుగువారి కళా ప్రాభవానికి ప్రతీకలైన ఈ నృత్య రీతుల్ని గురించి ఆధికారికంగా రచనలు చేశాడు. కొత్తగా నృత్యం నేర్చుకునే పిల్లల దగ్గర నుంచి పరిశోధన చేసే పండితుల వరకు – అందరికీ అవగాహన అయ్యేవిధంగా ఎన్నో పుస్తకాలు, వ్యాసాలు రాశాడు. నిజానికి ఆయన రాసిన వ్యాసాలను సంపాదించి ప్రచురిస్తే అవి నాట్యశాస్త్ర పరిశోధనకు పనికివచ్చే అమూల్యమైన ఆధారగ్రంథాలవుతాయి.

అటువంటి మహామహుడు, నాట్యకళావేత్త, కళాప్రపూర్ణుడు, భరత కళాప్రపూర్ణ బిరుదాంకితుడు అయిన నటరాజ రామకృష్ణను గురించి పుస్తకం రాయడం అంటే ఆధునికాంధ్ర నాట్యకళా చరిత్రను రాయడమే! వైవిధ్యభరితమైన దేశి, మార్గ, నృత్య విధానాలను కూలంకషంగా అధ్యయనం చేసిన రామకృష్ణను గురించి లాస్య తాండవ నృత్యరీతులకు రూపకల్పన చేసిన నటరాజును గురించి, లక్ష్యలక్షణ సమన్వయాలను సాధించిన నృత్యకళా, శాస్త్ర పారంగతుడైన రామకృష్ణను గురించి, సవిస్తరంగా కాలానుక్రమణికలో మన ముందుంచిన ఘనత ఈ పుస్తకానిది, ఈ పుస్తక రచయితలది. ముఖ్యంగా తనను గురించి తాను చెప్పుకోవడం యిష్టం ఉండని నటరాజు నుంచి యింత సమాచారాన్ని రాబట్టడమే గొప్ప విషయం. దానిని సవిమర్శకంగా తొమ్మిది అధ్యాయాలలో ఏ అధ్యాయానికి ఆ అధ్యాయం స్వయం సంపూర్ణం అయిన పద్ధతిలో చెప్పడం యింకా గొప్ప విషయం.

ఈ పుస్తకంలో నాకు బాగా నచ్చిన అధ్యాయం **"తపన–యోచన–సాధన."** రామకృష్ణ జీవన ప్రగతికి ఈ మూడు అంశాలు మూలకందాలు. ఆయన నృత్య పరిశోధనకు, ఆ పరిశోధనాంశాలను ఆచరణలో పెట్టడానికి కూడా ఈ మూడు అంశాలు మూడు సోపానాలు. ఈ మూడింటిని కూలంకషంగా చర్చించి చక్కగా సమన్వయం చేశారు రచయితలు. అలాగే

**"నాట్యశాస్త్ర గ్రంథాల రచయితగా రామకృష్ణ"** అన్న అధ్యాయం కూడా. రామకృష్ణ రాసిన 31 గ్రంథాల సమాలోచనం ఈ అధ్యాయం. లభ్యం కాని చాలా పుస్తకాలను సంపాదించి వాటిని అవలోకించి వాటిని పరిచయం చేయడం నృత్య విద్యార్థులకు చాలా ఉపయోగించే అంశం. ఇక రామకృష్ణ పరిశోధనా విషయాన్ని గురించిన అధ్యాయం. ఆంధ్రనాట్యం, నవజనార్దన పారిజాతం, పేరిణి – ఈ నర్తన విధానాల ఆవిష్కారం చారిత్రక ఆధారాలతో ఇందులో పొందుపరచడం జరిగింది. ఇది భవిష్యత్తులో పరిశోధనా విద్యార్థులకు అత్యంత సమాదరణీయం అయ్యే అధ్యాయం. వెరసి ఇది నటరాజ రామకృష్ణ గారి వ్యక్తిత్వ వికాసాన్ని, నృత్యకళా ప్రాభవాన్ని భావితరాల వారికి చెప్పే చక్కని ప్రయత్నం.

వీటి అన్నిటకన్న – నటరాజ రామకృష్ణ యీ ఎనభై వసంతాల జీవితం వెనక తెలుగువారి కళారూపాలంటే ఆయనకున్న గర్వంతో రంగరించుకొన్న అభిమానాన్ని, వాటి గొప్పతనాన్ని నలుగురికీ తెలియచెప్పాలన్న ఆతృతనీ – ఈ పుస్తకం మనకు అనుక్షణం విశదపరుస్తూ పోవడం – నాకు ఆనందాన్నిచ్చింది. అంతేకాదు, వీటి అన్నింటికి భూమికగా ఉన్న సాంస్కృతిక నేపథ్యాన్ని, నటరాజ రామకృష్ణ మానవతా దృక్పథాన్ని అడుగడుగునా జ్ఞాపకం చేస్తూ సాగిన ఈ రచన జీవిత చరిత్రల ప్రాథమిక రచనోద్దేశాలకు సరిగ్గా అద్దం పడుతున్నది అని సంభావిస్తాను.

నేను రాయవలసిన ఈ పుస్తకాన్ని – నాకత్యంత ఆప్తుడైన నటరాజు మీద పుస్తకాన్ని – నేను రాయగలిగిన దానికంటే అందంగా రాసినందుకు మా రామకృష్ణగారిని, లలిత గారిని హృదయపూర్వకంగా అభినందిస్తూ ఈ రచనకు దోహదం చేసిన చిరంజీవి సువర్చలను ఆశీర్వదిస్తున్నాను. ఈ పుస్తకం ఒరవడిలో తెలుగులో యింకా యిటువంటి జీవిత చరిత్రలు రావాలని ఆకాంక్షిస్తున్నాను – మరికొంచెం విశ్లేషణాత్మకంగా.

నిస్వార్థంగా తాను ప్రేమించే నృత్యకళకు ఇంకా సేవ చేయడానికి వీలుగా మా నటరాజుకు ఆరోగ్యాన్ని యివ్వాలని ఆ "మహా నటరాజు"ను ప్రార్థిస్తున్నాను.

**– ఆచార్య మొదలి నాగభూషణ శర్మ**

**ప్రధాన సంపాదకుడు**

**"నర్తనమ్" (అంతర్జాతీయ నృత్య త్రైమాసిక)**